క్లుప్తంగా

నేడు జెడ్పీ చైర్‌పర్సన్ రాక

కందుకూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి శనివారం రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లేమూరు, కందుకూరు, పులిమామిడి, ధన్నారం గ్రామాల్లో భూగర్భ డ్రైనేజ్, సీసీ రహదారుల నిర్మాణాలకు ఆమె శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు లేమూరు గ్రామం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ముగిసిన ఉమెన్స్ క్రికెట్ పోటీలు



విజేత జట్టుతో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో వారం రోజుల పాటు జరిగిన ఉమెన్స్ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ శుక్రవారం ముగిశాయి. పోటీల్లో ఆరు జట్లు పాల్గొనగా ఎలైట్ గరల్స్ విజేతగా నిలువగా, టీపీఆర్ అకాడమీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు. మహిళలు క్రీడలో రాణించాలని, ప్రతిభ కన బరిచిన వారికి కళాశాల తరపున స్కాలర్‌షిప్‌లు ఇచ్చి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, మీర్‌పేట కార్పొరేటర్ అక్కి మాధవి, కోచ్‌లు కిరణ్‌రెడ్డి, దయానంద్ పటేల్, నిర్వాహకుడు ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ సమావేశం

కందుకూరు: కందుకూరు పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం సంఘం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ కార్యదర్శి యాదగిరిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అధ్యక్షుడు డి.చంద్రశేఖర్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశంలో రైతుబంధు పథకంపై చర్చించనున్నారు. డైరెక్టర్లు, ఇతర సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మదర్ డెయిరీ కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న సభ్యులు

కందుకూరు: మదర్ డెయిరీ కందుకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా టంకరి సంజీవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మదర్ డెయిరీ ఆధ్వర్యంలో ఆయనతో పాటు మరో 9 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సభ్యులుగా యాదగిరిరెడ్డి, జ్యోతి, కృష్ణారెడ్డి, పాండు, ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, బాల్‌రెడ్డి, ప్రవీణ్, ఏ.జనాను ఎన్నుకున్నారు. అనంతరం నియామకపత్రాలను అందించారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కందుకూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో లైన్ల షిఫ్టింగ్ తదితర కారణాలతో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ కందుకూరు టౌన్, అగ్రికల్చర్ ఫీడర్ల షిఫ్టింగ్ పనుల నిమిత్తం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11కేవీ దెబ్బడగూడ మరియు అగ్రికల్చర్, 11కేవీ మహ్మద్‌నగర్ ఫీడర్ల పరిధిలో లైన్ల షిఫ్టింగ్ నిమిత్తం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ నేదునూరు టౌన్, మాన్యగూడ, అలీఖాన్‌పల్లి ఫీడర్లలో కొత్త సర్వీసుల పనుల నిమిత్తం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11కేవీ రాచులూరు టౌన్, ఏవీఆర్ ఫీడర్లలో లైన్ల షిఫ్టింగ్ పనుల కోసం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు అమ్మితే చర్యలు

హస్తినాపురం: ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలను అమ్మితే సహించేది లేదని చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ విద్యాశాఖ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం సాగర్‌రోడ్డు నాగార్జున కాలనీలోని ఓ పాఠశాల గదిలో పెద్ద సంఖ్యలో పుస్తకాలు నిల్వ చేశారని కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎఆర్‌పీ పి.రమేష్ అక్కడకు చేరుకుని స్టడీ మెటీరియల్ ఉన్న గదిని సీజ్ చేశారు.

గుంతల దారి.. అవస్థలే మరి!



గుంతలమయంగా ఆర్‌సీఐ ప్రధాన రహదారి



గుంతల్లో పోస్తున్న మట్టి

ఆర్‌సీఐ ప్రధాన రోడ్డుపై వాహనదారుల ఇక్కట్లు

- మరమ్మతులు చేపట్టాలంటున్న స్థానికులు

మీర్‌పేట: గుంతలమయమైన రహదారితో మీర్‌పేట కార్పొరేషన్‌లోని ప్రజానికం తీవ్ర అవస్థలు పడుతున్నారు. బిక్కుబిక్కుమంటూ రోడ్డుపై వెళుతూ నరకయాతన అనుభవిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తా నుంచి సూపర్ థియేటర్ వరకు గల రహదారి గోతులమయంగా మారడంతో రద్దీ వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలకు తోడు వర్షాకాలం కావడంతో రహదారిపై నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ఇటీవల అదుపుతప్పి కిందపడిన సంఘటనలు చాలా ఉన్నాయి. కార్పొరేషన్‌లో ప్రధాన రహదారి కావడంతో పాటు స్థానికులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా దీని గుండా వెళ్లాల్సి ఉంటుంది. రహదారి అధ్వానంగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వారు సైతం అవస్థలు పడుతున్నారు.

గుంతలను పూడ్చిన ట్రాఫిక్ సిబ్బంది

వాహనదారుల ఇక్కట్లు, వాహనాలు మలుపు తీసుకునే ప్రాంతం కావడంతో గ్రహించిన ట్రాఫిక్ సిబ్బంది ఇటీవల ఇటుకలతో కూడిన మట్టిని తీసుకొచ్చి గుంతల్లో పోయించారు. మట్టితో కొంత మేర గుంతలు పూడ్చినప్పటికీ వారం రోజుల తరువాత పరిస్థితి మళ్లీ యథాస్థితికి వచ్చిందని, సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని డిగ్రీ కాలేజీలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను వివిధ సబ్జెక్టుల వారిగా అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్లు) నియామకం చేపడుతున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. బోటనీ–1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్–1, కామర్స్–1, హిస్టరీ–1, పొలిటికల్ సైన్స్–1, మ్యాథమెటిక్స్–1, ఇంగ్లిష్–1.. మొత్తం 7 సబ్జెక్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హతలు పీజీలో మినిమం 55 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం), సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. పీహెచ్‌డీ అభ్యర్థులు లేని పక్షంలో నెట్/సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. వీరు కూడా లేని పక్షంలో పీజీ అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. బోధన అనుభవం కలిగిన వారికి వెయిటేజీ ఇస్తామన్నారు. (సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించాలి). జీతం బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రకారం హవర్లీ బేసిస్ (72 గంటల ప్రాతిపదికన) గౌరవ వేతనం ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు పూర్తి బయోడేటాతో కూడిన దరఖాస్తులను జూలై 2వ తేదీ సాయంత్రం 5గంటల లోపు బడంగ్‌పేటలోని డిగ్రీ కళాశాలలో సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్

బడంగ్‌పేట్: నాదర్‌గుల్ ప్రధాన రహదారిని బాగు చేయాలని కోరుతూ శుక్రవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రఘుకు స్థానిక కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల సునీతశ్రీకాంత్‌గౌడ్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది క్రితం హెచ్ఎండీఏ నుంచి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేసుకున్నదన్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అసంపూర్తి పనులు చేసి మధ్యలో వదిలివేయడంతో ఎక్కడి గుంతలు అక్కడే ఉండిపోయాయన్నారు. దీంతో వాహనదారులు అందులో పడి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వానాకాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కమిషనర్‌ను కోరారు.

సంస్కరణల సృష్టికర్తకు నీరాజనం

ఘనంగా మాజీ ప్రధాని పీవీ జయంతి



బడంగ్‌పేట్: పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘాల సభ్యులు

బడంగ్‌పేట్: దేశ మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నర్సింహారావు జయంతిని శుక్రవారం బడంగ్‌పేటలోని కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గ, బడంగ్‌పేట బ్రాహ్మణ సంఘాలు జయంతిని చేశాయి. ముందుగా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని గాడిలో పెట్టి మంచి పాలనను అందించిన పీవీ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవరావు, కార్యదర్శి ప్రమోద్, కాశీబుగ్గ టెంపుల్ ఆలయ ధర్మకర్తలు మదన్‌మోహనాచార్యులు, ప్రకాష్, రాంమూర్తి, రంగరాజు, యాదగిరిరావు, సంతోష్, రాజేశ్వరశర్మ, వంశీకృష్ణ, ఉమాశంకర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ గొప్ప ఆర్థిక సంస్కరణవేత్త

దిల్‌సుఖ్‌నగర్: తొలి తెలుగు ప్రధాని, ఆర్థిక సంస్కరణవేత్త, బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావు అని ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అన్నారు. భారతరత్న పీవీ జయంతి సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురి చౌరస్తాలో పీవీ క్యాంస్య విగ్రహానికి ఎమ్మెల్సీ వాణిదేవి, చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాణిదేవి మాట్లాడుతూ,భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి పీవీ అని అన్నారు. కార్యక్రమంలో సామాజిక సేవకులు ఉపేందర్‌రెడ్డి, నాయకులు మధుసూధన్‌రావ్, పీవీ శశిధర్‌రావ్, రమేష్ నేత, సురేంద్రకుమార్, మహేందర్, శ్రీశైలం, జహంగీర్, నగేష్, సంతోష్ పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్మన్ మధుమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మధుమోహన్

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ కాంటేకర్ మధు మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో సీసీ రోడ్డు, అంతర్గత డ్రైనేజీల నిర్మాణం, తాగునీరు తదితర పనులకు గాను రూ.8కోట్ల80 లక్షల నిధుల ఖర్చుకు గాను కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, ఏఈ భార్గవ్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, అనిత, శివకుమార్, మౌనిక, పద్మ, తేజస్విని, హేమలత, విలాస్, రవినాయక్, సుమన్, భావన, రాజు, టీపీఎస్ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

108 కలశాలతో అభిషేకం



108 కలశాలతో అభిషేకంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్ర వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ 22వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు.పూర్ణాహుతి హోమం,బేరి పూజ,12 రకల ప్రసాదాలచే స్వామివారికి నైవేద్యం సమర్పించినట్లు ఆలయ చైర్మన్ వూర నర్సింహ గుప్తా తెలిపారు. ఆరురోజుల పాటు వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు రమణయ్య, రమేష్, వీరేశం, కుమారస్వామి, శ్రీనివాసరావు, కోశాధికారి రమేష్, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, బచ్చు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

కబ్జాదారులకు మద్దతు పలుకుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు



జీహెచ్ఎంసీ స్థలంలో వేసిన ఫెన్సింగ్

మన్సూరాబాద్: సుమారు రూ.3 కోట్ల జీహెచ్ఎంసీ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకుండా ఆక్రమణదారులకు మద్దతు పలుకుతున్నారని సమీప కాలనీలవాసులు ఆరోపిస్తున్నారు. వివరాలు... మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారాస్టేట్స్ కాలనీ మొదటి గేటు సమీపంలో ప్రభుత్వ నిబంధనల మేరకు సెట్‌బ్యాక్ వదిలి అపార్ట్‌మెంట్ నిర్మాణం మొదలు పెట్టారు. నిర్మాణం పూర్తి కావడంతో కొన్నేళ్ల తర్వాత అపార్ట్‌మెంట్ యజమాని సెట్ బ్యాక్ స్థలాన్ని తిరిగి చదును చేయటానికి ప్రయత్నించాడు. విషయం గమనించిన స్థానిక కాలనీలవాసులు అడ్డుకుని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ స్థలాన్ని కాపాడాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణదారులకు మద్దతుగా నిలుస్తున్నారని, రోడ్డు కోసం వదిలిన స్థలాన్ని రాజకీయ పైరవీలతో తిరిగి ఆక్రమించేందుకు అపార్ట్‌మెంట్ యజమాని యత్నిస్తున్నాడని, ఈ స్థలాన్ని అధికారులు రక్షించాలని కాలనీలవాసులు కోరు తున్నారు. కాగా, ఈ విషయంపై హయత్‌నగర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావనిని వివరణ కోరగా.. సెట్‌బ్యాక్ స్థలానికి ఫెన్సింగ్ వేసి గ్రీనరీ ఏర్పాటు చేసి.. ఇది జీహెచ్ఎంసీ స్థలమని పేర్కొంటూ బోర్డు పెడుతున్నామన్నారు. సెట్‌బ్యాక్‌తో వదలిన స్థలంలో నిర్మాణాలు చేపడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రహదారులు మురుగుమయం



అల్కాపురి చౌరస్తాలో పొంగుతున్న డ్రైనేజీ



నందనవనం కాలనీలో ఇదీ పరిస్థితి

- ఇటు వాన నీరు.. అటు డ్రైనేజీ నీరు
- రోడ్లను ముంచెత్తుతున్న మురుగు
- దుర్వాసనతో కాలనీవాసుల అవస్థలు
- నియంత్రణలపై అధికారుల నిర్లక్ష్యం

ఎల్‌బీనగర్: వాన కురిసినప్పుడు కాలనీలను ఒక పక్క డ్రైనేజీ నీరు.. మరోపక్క వర్షం నీరు ముంచెత్తుతోంది. దుర్వాసనతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీలు నిండి పలు కాలనీలు చిన్నపాటి ఊట చెరువుల్లా మారాయి. దీంతో ఆయా కాలనీల వారు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ఈ పరిస్థితి నెలకొంది. చిన్న పాటి వర్షానికే డ్రైనేజీలు పొంగడం వల్ల రోడ్లన్నీ మురుగునీటితో జలమయం అవుతుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని పాదచారులు, వాహనదారులు వాపోతున్నారు.

దుర్వాసన.. నీటి కాలుష్యం

పొంగుతున్న డ్రైనేజీల కారణంగా పరిసరాలు అస్తవ్యస్తంగా మారి దుర్వాసన వస్తోంది. ఫలితంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వర్షా కాలంలో డ్రైనేజీ నీరు తాగునీటిలో కలుస్తోంది. నీటి కాలుష్యం కారణంగా జనం అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో చంపాపేట, హస్తినాపురం, వనస్థలిపురం తదితర డివిజన్లలో నీటి కాలుష్య సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

పొంగుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో వాటర్ వర్క్స్ అధికారులు విఫలమవుతున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. పొంగుతున్న డ్రైనేజీలను అధికారులు వెంటనే శుభ్రం చేయించకపోవడంతో రోజంతా మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఫలితంగా దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి పొంగుతున్న డ్రైనేజీలను శుభ్రం చేయించి మురుగునీరు రోడ్లపైకి రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

కాలనీలో డ్రైనేజీలు పొంగి రోడ్లు దుర్గంధం వెదజల్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోజంతా రోడ్లపై మురుగు పారుతుండంతో ఇంటి నుంచి బయటకు రావాలంటే తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– ఎల్లయ్య, హస్తినాపురం

ప్రజలకు ఇబ్బంది రాకుండా నిర్మించండి

మంత్రి కోమటిరెడ్డికి కార్పొరేటర్ వినతి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సౌకర్యవంతంగా ఉండేలా విజయవాడ జాతీయ రహదారి నిర్మాణ పనులను చేపట్టాలని కోరుతూ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మన్సూరాబాద్‌లోని తన కార్యాలయంలో మాట్లాడుతూ, విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధిలో భాగంగా స్థానికంగా నిర్మిస్తున్న అండర్ పాస్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని మంత్రికి వివరించానని తెలిపారు. రోడ్డు నిర్మాణం విషయంలో స్థానిక కార్పొరేటర్ల సమక్షంలో ప్రజల అభిప్రాయం సేకరించి పనులు చేపట్టాలని ఆర్ అండ్ బీ అధికారి ధర్మారెడ్డిని మంత్రి ఆదేశించారని స్పష్టం చేశారు. జాతీయ రహదారి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీలకు కనెక్టివిటీ రోడ్డు, పలుచోట్ల యూటర్న్‌లు, వ్యాపారులకు ఇబ్బందులు కల్గకుండా ప్రణాళికలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, ఆర్ అండ్ బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులకు నిదర్శనం..

మ్యాన్‌హోల్ పక్కన దిగబడిన స్కూల్ బస్



రహదారిపై దిగబడిన బస్

చంపాపేట: విద్యార్థులను స్కూల్‌కు తీసుకెళ్తున్న ప్రైవేట్ పాఠశాల మాన్‌హోల్ పక్కన రోడ్డులో దిగబడిన ఘటన శుక్రవారం చంపాపేట డివిజన్‌లో జరిగింది. వివరాలు.. సరూర్‌నగర్, చంపాపేట, కర్మన్‌ఘాట్ నుంచి ప్రతి రోజూ పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లే ఓ స్కూల్ బస్ డివిజన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీ ఆర్చ్ సమీపంలోని మాన్‌హోల్ పక్కన రహదారిపై దిగబడిపోయింది. బస్ విద్యుత్ స్తంభం వైపు ఒరగడంతో విద్యార్థులంతా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానికులు విద్యార్థులందరినీ బస్ నుంచి దించి వేరే బస్‌లో సురక్షితంగా పాఠశాలకు చేర్చారు. నాణ్యత లేకుండా సీసీ రోడ్డు నిర్మించడం వల్లే ఇలాంటి ఘటనలు కాలనీలో జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి



మూసారంబాగ్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల, అధికారులు

మలక్‌పేట: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ విభాగం అధికారులతో కలిసి శుక్రవారం మూసారంబాగ్ డివిజన్‌లో సాయినగర్, బడాబజార్, జహీర్ రెసిడెన్సీ ప్రాంతాల్లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాక్స్ డ్రైన్, సీసీ రోడ్డు పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

రూ.250 కోట్లు మంజూరు చేయండి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ సందర్భంగా సీఎంకు విజ్ఞప్తి



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: సీఎం రేవంత్‌రెడ్డికి మహేశ్వరం పట్ల ఏ మాత్రం అభిమానం ఉన్నా రద్దు చేసిన రూ.250 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచం, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఆడ పిల్లలకు మేనమామగా మారి కల్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్‌లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొంత ఆలస్యమైనప్పటికీ ఈ ప్రభుత్వం ఎట్టకేలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా తులం బంగారం కూడా ఇవ్వాలన్నారు. పేదలు నివాసం ఉండే జల్‌పల్లి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల నిమిత్తం గత సర్కార్ ఎస్‌డీఎఫ్ కింద రూ.50 కోట్లు, హెచ్ఎండీఏ కింద రూ.45 కోట్లు మంజూరవ్వగా.. ఎన్నికల కోడ్ కారణం కూడా పరిగణనలోకి తీసుకోకుండా నాన్ స్టార్టెడ్ సాకుతో దాదాపు రూ.75 కోట్లు వెనక్కి తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డి, జల్‌పల్లి కమిషనర్ వాణిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, జనార్దన్, హామెద్, అర్జున్, దస్తగిర్, శంషుద్దీన్, యాహ్యా తదితరులు పాల్గొన్నారు. షాదీ ముబారక్ చెక్‌ల పంపిణీకి స్థానిక ఎమ్మెల్యే విచ్చేసినా జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఆసక్తికర సన్నివేశం

చెక్‌ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఓ లబ్ధిదారురాలి పేరు 'పట్లోళ్ల సునీతారెడ్డి' కావడంతో స్వయానా సబితారెడ్డి ఇంటి పేరు కావడంతో ఎమ్మెల్యేతో పాటు అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. తాను చేవెళ్ల వాసినేనని.. కానీ ఎన్నో ఏళ్ల క్రితం శ్రీరాం కాలనీకి వచ్చి స్థిరపడ్డామని ఈ సందర్భంగా ఆమె చెప్పుకొచ్చారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేపట్టారు. దీనికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై స్థానిక మేయర్ చిగురింత పారిజాతారెడ్డితో కలిసి లబ్ధిదారులకు చెక్‌లను అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, తహసీల్దార్ మాధవీరెడ్డి, డీటీ మణిపాల్‌రెడ్డి, కమిషనర్ రఘు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.